ఆలయ నిర్మాణంపై ఆటంకాలొద్దు

- అలాంటి వారికి మంచి బుద్ధులు రావాలి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు
- వేంకటేశ్వరస్వామి ఆలయంపై జెండాను ఆవిష్కరించిన గండ్ర జ్యోతి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : మంచి ఉద్దేశంతో భూపాలపల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపడితే కొందరు ఆటంకాలు కల్పిస్తున్నారని, వారికి కూడా మంచి బుద్ధులు రావాలని ఆ దేవున్ని కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు అన్నారు. మంజూర్‌నగర్‌లో నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంపై బుధవారం వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తిరుపతి వేంకటేశ్వరుడి పాదాల వద్ద ఉంచిన జెండాను ఆవిష్కరించారు. అనంతరం గండ్ర దంపతులు మాట్లాడుతూ పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, ప్రతిష్టాపన అనంతరం భూపాలపల్లి నుంచి తిరుమల తిరుపతికి కాలి నడకన వస్తానని గండ్ర జ్యోతి సంకల్పించి, జనవరి 20న బయలుదేరి ఫిబ్రవరి 12న తిరుపతికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు. పాదయాత్రగా తీసుకెళ్లిన జెండాను స్వామివారి పాదాల వద్ద ఉంచి తిరిగి మంజూర్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఆవిష్కరించినట్లు తెలిపారు. దాదాపు 24 రోజులు 680 కిలో మీటర్లు నడిచి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. పాదయాత్రలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను సంకల్పి చేసిన యాత్ర ఎన్నో జన్మల పుణ్యమని తెలిపారు. అనంతరం గండ్ర దంతులను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాంశెట్టి లత, గాయపు శ్రీమాల, తిరుపతమ్మ, స్వప్న, పద్మ, సుజాత, నాయకులు పాల్గొన్నారు.

ఆలయంపై జెండా ఆవిష్కరిస్తున్న జ్యోతి


గండ్ర దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడారం మహాజాతరకు రండి

మండలి చైర్మన్‌కు మంత్రి సీతక్క ఆహ్వానం

గుత్తా సుఖేందర్‌రెడ్డికి అమ్మవార్ల గద్దెల ప్రతిమను అందిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ) : సమ్మక్క-సారలమ్మ జాతరకు హాజరు కావాలని కోరుతూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మంత్రి సీతక్క మహా జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వనదేవతల గద్దెల ప్రతిమలను అందజేసి ఆహ్వానించారు.

కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో సాహితీ మిత్ర, ఎంపీడీవోలు

బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధికారులు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14 : రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బదిలీల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆయా శాఖలకు నూతనంగా వచ్చిన జిల్లా అధికారులు బుధవారం వారివారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. వారిలో డీఆర్‌డీవో పీ నరేశ్, అడిషనల్ డీఆర్‌డీవో ఎండీ నూరోద్దీన్, డీపీవో నారాయణరావు, డీఎల్‌పీవో వీరభద్రయ్య, జడ్పీ డిప్యూటీ సీఈవో సాహితీ మిత్రతో పాటు పలువురు ఎంపీడీవోలున్నారు. అనంతరం వారు కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి కమిషనర్‌గా రాజేశ్వర్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14: భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్‌గా టీ రాజేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను హనుమకొండ జిల్లాకు ఎంపీడీవోగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌ను నియమించింది.

సమావేశంలో మాట్లాడుతున్న భద్రయ్య

సమస్యలను నీరుగార్చుతున్న కాంగ్రెస్

ములుగురూరల్, ఫిబ్రవరి 14 : సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్‌తో పాటు హెచ్ఆర్సీ కమిషనర్‌ను నియమించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చుతున్నదని ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం శాఖలో కమిషనర్ల నియామకం జరుగకపోవడంతో ఎన్నో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమర్థులైన రిటైర్డ్ జడ్జిలను కమిషనర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, పట్టణ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, జాగృతి జిల్లా అధ్యక్షుడు పోరిక రవీందర్‌నాయక్, పెట్టెం రాజు పాల్గొన్నారు.

వైభవంగా భూనీలాసమేత చెన్నకేశవస్వామి కల్యాణం

కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కాటారం, ఫిబ్రవరి14 : మండలంలోని చింతకానిలో భూనీలాసమేత చెన్నకేశవస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. స్వయంభువుగా వెలిసిన చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతియేటా వసంతపంచమి రోజున కల్యాణం జరుపడం ఆనవాయితీగా వస్తున్నది. ఆలయ అనువంశిక ధర్మకర్తలు శేషగిరిరావు-రాణి, నర్సింగారావు-శశిరేఖ దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యుడు గడ్డం రాజు-తిరుమల దంపతులు చేతుల మీదుగా కల్యాణతంతు సాగింది. ఆలయ ఆవరణలో అనంతుల శ్రీనివాస్, నిడిగొండ రవితో పాటు ఉత్సవ కమిటీ అన్నదానం నిర్వహించింది. కార్యక్రమంలో చింతకాని ఎంపీటీసీ విజయారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఫిరోజ్‌ఖాన్, మండల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ కోసరి భాస్కర్, ఉత్సవ కమిటీ సభ్యులు, వేదపండితులు రాజబాపుశర్మ, కృష్ణమూర్తి, లోకె సురేశ్, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు గోల్డ్ మెడల్

విఘ్నశ్రీకి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14 : 6వ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌లో మండల కేంద్రంలోని పాఠశాలకు చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. 8వ తరగతికి చెందిన అలువాల విఘ్నశ్రీ, గాడిచర్ల మణిదీపిక, బోడ సహస్ర, లక్ష్మి కటా విభాగంలో బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అభినందించింది. సాధించిన మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, కోచ్ అబ్బు, ఉపాధ్యాయులు సుగుణాదేవి, చాట్ల రవి, రామకృష్ణ, సమ్మక్క, సుమన్, సులోచన, సబిత, రవీందర్, రాజేశ్, రజిని, రాజు, భాగ్యవతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మేడారం బస్‌పాయింట్‌కు స్థల పరిశీలన

మంగపేట, ఫిబ్రవరి 14 : మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం బుధవారం తహసీల్దార్ వీరస్వామి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు ఆర్టీసీ డిపో అధికారులు మండలకేంద్రంలోని గంపోనిగూడెం రైతు వేదిక సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఈనెల 18 నుంచి జాతర ముగిసేవరకు ఇక్కడి నుంచే బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు చెప్పారు. బస్‌పాయింట్ వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శికి తహసీల్దార్ సూచించారు. వారి వెంట ఏవో చేరాలు, డీటీ మల్లేశ్వర్‌రావు, జీపీ కార్యదర్శి సురేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న అధికారులు


బదిలీపై వెళ్తున్న అధికారులతో కలెక్టర్ భవేశ్ మిశ్రా

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14: విధి నిర్వహణలో వెనుకబడిన ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బదిలీపై వెళ్తున్న డీపీవో ఆశాలత, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పురషోత్తం, డీపీవో సుధీర్‌కుమార్, అదనపు డీఆర్డీవో సురేశ్, తహసీల్దార్లు మంజుల, సుమన్, ఎంపీడీవోలు అనిల్, అరుంధతి, శంకర్, ఆంజనేయులు, నరసింహమూర్తి, కృష్ణవేణి, సురేందర్‌కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేయగా కలెక్టర్ హాజరై వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడికి గురికావద్దని, అలా అయితే ఆశించిన మేర ఫలితాలు సాధించలేమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, జడ్పీసీఈవో విజయలక్ష్మి, సీపీవో శామ్యూల్, డీపీఆర్వో శ్రీధర్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, ఫిషరీష్ అధికారి అవినాష్ పాల్గొన్నారు.

వేటగాళ్ల బైండోవర్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14 : అటవీ జంతువులను వేటాడే ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. గతంలో మండలకేంద్రానికి చెందిన ఎద్దు జగదీశ్, ఎద్దు కోటేష్, బోయిరి రవితేజ కరెంటు తీగలు అమర్చి జంతువులను వేటాడినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. విద్యుత్ వైర్లు అమర్చి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీశాఖ, కరెంటు, పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు.

పంటల పరిశీలన

ములుగురూరల్, ఫిబ్రవరి14 : మండలంలోని బండారుపల్లి, ములుగు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి మునుకుంట్ల సంతోష్ బుధవారం పంటలను పరిశీలించారు. కాండం తొల్చు పురుగు యాజమాన్య పద్ధతులకు రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈవో దీపక్, రైతులు ఉన్నారు.

తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14: భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లను కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సాయంత్రం వివిధ మండలాలకు కేటాయించారు. కొమురం భీం ఆసిఫాబాద్ నుంచి వచ్చిన ఆర్ ప్రహ్లాద్‌ను చిట్యాలకు, భద్రాది కొత్తగూడెం నుంచి వచ్చిన ఎల్ వీరభద్రంను గోరికొత్తపల్లికి, హెచ్ రంగాను ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటర్‌గా, జగిత్యాల నుంచి వచ్చిన కే విజ యలక్ష్మిని టేకుమట్లకు, గోరికొత్తపల్లి తహసీల్దార్ కే రవికుమార్‌ను మల్హార్ మండల తహసీల్దార్‌గా నియమించారు.

బొగ్గు ఉత్పత్తికి సహకరించాలి

సింగరేణి జీఎం శ్రీనివాసరావు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొకుండా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులతో 16న జాతీయ సంఘాలు చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెపై జీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మె అంశాలన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివని, సింగరేణి సంస్థకు వాటితో ఎలాంటి సంబంధం లేదన్నారు. బొగ్గు డిమాండ్ అధికంగా ఉన్నందున కార్మికులు సమ్మెలో పాల్గొకుండా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సమ్మెకు దూరంగా ఉంటామని జీఎంకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీజీఎం వీ రవికుమార్, ఏరియా అధికారి ప్రతినిధి అజ్మీరా తుకారాం, ఏరియా సెక్యూరిటీ అధికారి టీ రవి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం రమేశ్, జే బుచ్చయ్య పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళులు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14 : పుల్వామాలో పాకిస్థాన్ ముష్కరుల దాడిలో మృతి చెందిన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లకు బుధవారం మాజీ సైనికుల కుటుంబాలు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించాయి. ఈ ఘటన జరిగి ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అమర జవాన్ల స్తూపం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సైనికుల కుటుంబ సభ్యులు బేతోజు భరత్ కుమార్ చారి, వజ్రమణి, దుబాసి రాజయ్య, మచ్చ భద్రయ్య, మచ్చ వెంకన్న, దుగ్యాల కిషన్‌రావు, చుక్క బాలరాజు, భూక్య శ్రీరామ్, సురేందర్ సాహు, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

భూపాలపల్లిలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం పుల్వామా అమర జవాన్లకు సంతాపంగా ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో తరుణ్, శివాజీ, వికాస్, రాజబాబు, వియన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

అమరజవాన్ల త్యాగాలు, ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాం ప్రసాద్ అన్నారు. పుల్వామా ఘటనలో అమరులైన జవాన్లకు విద్యార్థులు, అధ్యాపక బృందంతో కలిసి నివాళులర్పించారు.

కబడ్డీలో నైపుణ్యం సాధించాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని విద్యార్థులు ఖేలో ఇండియా సెంటర్‌ను వినియోగించుకొని కబడ్డీ క్రీడలో నైపుణ్యం సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీహెచ్ రఘు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా సెంటర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబడ్డీపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రతిరోజూ సెంటర్‌కు వచ్చి సాధన చేసి ఉన్న స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి స్పోర్ట్స్ సూపర్ వైజర్ పర్శ శ్రీనివాస్, కోచ్ చల్లా శ్రీనివాస్, పీఈటీలు రాజు, ఐశ్వర్య, కృష్ణ, డీవైఎస్‌వో సిబ్బంది శివ సాగర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

వెంకటాపూర్/ కాటారం, ఫిబ్రవరి 14 : వసంత పంచమి వేడుకలు బుధవారం వెంకటాపూర్, కాటారం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. వెంకటాపూర్ మండలం పాలంపేట పాఠశాలలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, డీసీఈబీ విజయమ్మ, ఎంఈవో సామల శ్రీనివాస్ హాజరై సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, కొండ్లె కృష్ణమూర్తి, కోకిల శ్రీరంగం, వేణు, రమేశ్, వీరేందర్, అనిత, శ్రీనివాస్, ఏడుకొండలు, బాలాజీ, ఖైరున్నీసాబేగం పాల్గొన్నారు. కాటారం మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి మహారుద్రాభిషేకం, బస్మాభిషేకం నిర్వహించారు. ఆదర్శ హైస్కూల్‌లో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు బచ్చు అశోక్, బచ్చు ప్రకాశ్, రామకృష్ణారావు, నవీన్, చీమల రాజు, పెండ్యాల రంజిత్, ఆదర్శ హైస్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ప్రిన్సిపాల్ క్రుషిత, వేద పండితుడు శివ పాల్గొన్నారు.

గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మండలంలో జాతరల సందడి

కాటారం, ఫిబ్రవరి14 : మండలంలో బుధవారం సమ్మక్క, సారలమ్మ జాతర సందడి నెలకొంది. గంగారం, రేగులగూడెం, పోతుల్వాయి, దేవరాంపల్లి, వీరాపూర్, మేడిపల్లి, చింతకాని తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు, భక్తులు అడవికి వెళ్లి తల్లులకు ప్రతీకగా చెప్పుకునే కంకవనాన్ని తెచ్చి డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య సారలమ్మ గద్దెపై ప్రతిష్టించారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు వారం ముందు ఆయా గ్రామాల్లోనే జాతర నిర్వహించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తున్నది. భక్తులు అమ్మవార్లకు ఒడి బియ్యంతో పాటు కానుకలు సమర్పించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14 : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో దుకాణా యాజమానులకు క్లాత్ సంచులను అందజేశారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వాడకుండా సహకరించాలని ఎంపీపీ అంతటి విజయ, జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, పంచాయతీ ప్రత్యేకాధికారి దామోదరస్వామి వ్యాపారులకు సూచించారు. గ్రామ పంచాయతీ నుంచి బస్టాండు, బొడ్రాయి సెంటర్, ప్రధాన రహదారి వెంట అవగాహన ర్యాలీ నిర్వహించి వ్యాపారులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఉద్యోగులు రవీందర్, వెంకన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి

ములుగురూరల్, ఫిబ్రవరి14 : విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని శివతండా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ తారకమ్మ(59) మంగళ వారం రాత్రి కొడుకు, కోడలు, పిల్లలతో కలిసి భోజనం చేసిన అనంతరం తన గదిలో ఫ్యాన్ స్విచ్ వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాలు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గణపురం ఎంపీడీవోగా భాస్కర్

గణపురం, ఫిబ్రవరి 14 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి ఎంపీడీవో ఎల్ భాస్కర్‌ను గణపురం ఎంపీడీవోగా బదిలీ చేసింది. కాగా, ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన లెక్కల అరుంధతి వరంగల్ జిల్లా దుగ్గొండికి బదిలీ అయ్యారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

కాటారం, ఫిబ్రవరి14 : మండలంలోని 353(సీ) జాతీయ రహదారిపై మేడిపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన శ్రావణ్, మిత్రులు, బంధువులతో కలిసి కారులో మేడారం వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. మేడిపల్లి సమీపంలోని టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ జాం కావడంతో శ్రావణ్ కారును ఆపేశాడు. ఇంతలో వెనుకనుంచి వస్తున్న లారీ డ్రైవర్ బ్రేకులు రాకపోవడంతో కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందున్న మరో లారీని ఢీకొని నుజ్జునుజ్జైంది. కాగా, కారులో ఉన్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడి కేసులో ఒకరి రిమాండ్

రేగొండ, ఫిబ్రవరి 14 : దివ్యాంగురాలిపై లైంగికదాడి చేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చిట్యాల సీఐ వేణు చందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ పోరాండ్ల రాము అదే గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలిని తన ఇంటికి పిలుచుకొని లైంగికదాడి చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో గమనించిన తల్లిదండ్రులు అక్కడికి రాగా రాము పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై రవికుమార్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. రామును అదుపులోకి తీసుకొని విచారించి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

కాపురానికి తీసుకెళ్లండి

భర్త ఇంటి ముందు భార్య నిరసన

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 14 : తనను కాపురానికి తీసుకెళ్లాలంటూ ఓ భార్య తన భర్త ఇంటి ముందు బుధవారం నిరసనకు దిగింది. ఈ ఘటన భూపాలపల్లి పట్టణంలోని బీసీ కాలనీలో చోటుచేసుకుంది. బాధితురాలు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ములుగు జిల్లాలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పెండ్యాల నరేన్‌కుమార్‌కు, తనకు 2020లో వివాహం కాగా, ఒక బాబు జన్మించాడని, అనంతరం రెండేళ్ల నుంచి కాపురానికి తీసుకెళ్లకపోడంతో గత్యంతర లేక భర్త ఇంటి ముందు నిరసన చేపట్టినట్లు తెలిపింది. గతంలో నరేన్‌కుమార్‌కు ఒకరితో ఎంగేజ్‌మెంట్ కాగా, దానిని క్యాన్సిల్ చేసుకున్నాడని, అలాగే మరొకరిని పెళ్లి చేసుకొని ఆరు నెలల్లోనే విడాకులిచ్చాడని పేర్కొంది. ఆ పిదప తనను పెళ్లి చేసుకున్నాడని, ఇప్పుడు తన పరిస్థితి వారిలాగే తయారైందని ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, విషయం తెలుసుకున్న పోసులు అక్కడకు చేరుకొని బాధితురాలితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమెను పంపించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

గోవిందరావుపేట, ఫిబ్రవరి14 : మండలంలోని గోవిందరావుపేట-పస్రా జాతీయ రహదారిపై డివైడర్‌ను బుధవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. వివరాల్లోకి వెళితే హనుమకొండ నుంచి భక్తులతో మేడారం వెళ్తున్న లగ్జరీ బస్సు ఉదయం 3:30 గంటల సమయంలో ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతినగా అద్దాలు పగిలిపోయాయి. ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో భక్తులు గాఢ నిద్రలో ఉన్నట్లు తెలిసింది. ఎన్‌హెచ్ అధికారులు రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోడమే ప్రమాదానికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. జాతర రద్దీ పెరుగనున్నందున ఇప్పటికైనా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వాలి

మహదేవపూర్, ఫిబ్రవరి 14 : గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రాజేశ్వర్‌రావు ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని సూరారం గ్రామంలో ఎస్సై ప్రసాద్, పోలీసులతో కలిసి ఆయన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గంగారం శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో 20 లీటర్ల గుడుంబాను గుర్తించి సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. గ్రామ ప్రధాన కూడలిలో గ్రామస్తులతో మాట్లాడారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాస్, కిషన్, విక్రాంత్, శ్యామ్, చంద్రమోహన్, ఆనంద్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించితేనే దేశం బాగుపడుతుంది

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశం బాగుపడుతుందని అఖిలపక్ష నాయకులు అయిత ప్రకాశ్‌రెడ్డి, బందు సాయిలు, క్యాతరాజు సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ కార్మికుల హక్కులను కాలరాసి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి అదానీ, అంబానీలకు కట్టబెట్టారని ఆరోపించారు. అఖిలపక్షం ఆ